



జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




మంగళవారం 10 మార్చి 2026 | పేజీలు 04 | వెల - 2/- | సంపుటి 01 సంచిక 281 | ప్రచురణ - తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : కాసే అమృత

## క్రీడాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

### ఒలింపిక్స్ లక్ష్యంగా అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా వసతులు అభివృద్ధి చేయాలని సూచన





సందేశం టైమ్స్, జూబ్లీహిల్స్, మార్చి 10: తెలంగాణ రాష్ట్రంలో క్రీడా రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి క్రీడాశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేమ్ నరేందర్ రెడ్డి, సాట్స్ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాస రాజు, శేషాద్రి, సాట్స్ ఎండీ సోనీ బాలదేవి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి. కిషోర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో సౌకర్యాలు కల్పించడం, అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటు చేయడం వంటి అంశాలపై చర్చించారు. ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ అందించేందుకు రాష్ట్రంలో సమగ్ర సదుపాయాలతో స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. గచ్చిబౌలి ఔట్‌డోర్ స్టేడియంను పునరుద్ధరించడంతో పాటు స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, వివిధ క్రీడా మైదానాలు మరియు శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. నిర్మాణాలకు సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి వాటిపై అధికారులకు సూచనలు చేశారు. భవిష్యత్తులో ఒలింపిక్స్ మరియు కామన్‌వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా, అలాగే ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్‌నగర్ స్టేడియంలను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆధునీకరించి శిక్షణ, పోటీలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## గవర్నర్ కు ఘన వీడ్కోలు





సందేశం టైమ్స్, హైద్రాబాద్, మార్చి 10: మహారాష్ట్ర గవర్నర్ గా బదిలీ కావడంతో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, కుటుంబ సభ్యులతో కలిసి బేగంపేట విమానాశ్రయానికి చేరారు. ఈ సందర్భంలో ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి శ్రీ రామకృష్ణారావు, జిల్లా కలెక్టర్ శ్రీ హరిచందన దాసరి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీ దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ రాహుల్ బొజ్జాలు గౌరవపూర్వకంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలసి పుష్పగుచ్చాలు అందజెప్పి వీడ్కోలు పలికారు.



## గిరిజన సంక్షేమ శాఖ కొత్త సంచాలకులుగా సంతోష్ బి.ఎం. బాధ్యతలు స్వీకరించారు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 10: హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈ రోజు శ్రీ సంతోష్ బి.ఎం., ఐఏఎస్ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీ సంతోష్ బి.ఎం. ఆయా విభాగాల అధికారులు, సిబ్బందితో వారి విధులు, పనులను సమీక్షించారు. విభాగాల వారీగా చేయవలసిన పనులను వివరించమని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ-ఫైలింగ్ ప్రారంభించమని సూచించారు.అయన ప్రత్యేకంగా గిరిజన సంక్షేమ పథకాలు అడవుల చివరి ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులకూ చేరే విధంగా ప్రణాళికలు రూపొందించాలని, గిరిజనుల ఆరోగ్యం, విద్యావకాశాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. గిరిజన సమస్యలను, సంక్షేమ అవసరాలను అవగాహన చేసుకుని వారం రోజులలో గిరిజన ప్రాంతాలను పర్యటించి తదనుగుణంగా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు శ్రీ విట్టా సర్వేశ్వర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ బాలు, గిరిజన పరిశోధన సంస్థ సంచాలకులు డా. వి. సముజ్వల, జీసీసీ జీఎం శ్రీ ప్రతాప్ రెడ్డి, జాయింట్ డైరెక్టర్లు శ్రీ పోచం, శ్రీమతి సంధ్యారాణి తదితర అధికారులు పూల మొక్కలు ఇచ్చి శ్రీ సంతోష్ బి.ఎం. ను ఆహ్వానించారు.తదుపరి, బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీ సంతోష్ బి.ఎం. సచివాలయానికి వెళ్ళి గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీ సబ్యసాచి ఘోష్ గారికి పూల మొక్క ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు.




## యువతకు సివిల్ డిఫెన్స్ వాలంటీర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం

### అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ స్పందనకారులుగా యువతను తయారు చేయడమే లక్ష్యం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 10: తెలంగాణ అగ్ని మాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవలు మరియు సివిల్ డిఫెన్స్ శాఖ ఆధ్వర్యంలో యువతను అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ స్పందనకారులుగా తీర్చిదిద్దేందుకు “సివిల్ డిఫెన్స్ వాలంటీర్ శిక్షణ కార్యక్రమం”ను ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమం మార్చి 9 నుంచి మార్చి 15 వరకు మొత్తం ఏడు రోజుల పాటు నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని సైఫాబాద్ పీజీ కళాశాలలో నిర్వహించిన ప్రారంభ కార్యక్రమాన్ని అగ్ని మాపక సేవల డైరెక్టర్ జి.వి. నారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులు, ముఖ్యంగా గాలి దాడులు, రసాయన దాడులు, అణు ప్రమాదాలు మరియు ఇతర విపత్తుల సమయంలో శిక్షణ పొందిన వాలంటీర్లు ప్రభుత్వ శాఖలకు సమర్థంగా సహకరించగలరని తెలిపారు. ఈ శిక్షణలో వాలంటీర్లకు రక్షణ చర్యలు, అగ్ని మాపక చర్యలు, ప్రథమ చికిత్స, గుంపు నియంత్రణ మరియు సహాయక సామగ్రి పంపిణీ వంటి అంశాలలో ప్రాయోగిక శిక్షణ అందిస్తారని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వాలంటీర్లు పోలీస్, అగ్ని మాపక సేవలు, జాతీయ విపత్తు స్పందన దళం మరియు ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని పనిచేస్తారని తెలిపారు. అలాగే అగ్ని మాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవలు మరియు సివిల్ డిఫెన్స్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించగా, శిక్షణ పొందిన వాలంటీర్లతో బలమైన సమాజం ఏర్పడి అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎఫ్‌ఓ ఎమ్‌జడ్-1 బి. సుధాకర్ రావు, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డి. కరుణ సాగర్, వైస్ ప్రిన్సిపల్ ఈ. రామా మరియు అగ్ని మాపక శాఖకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.



## సూర్యాపేటలో పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 10: ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డుల్లో పరిశుభ్రత కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, కౌన్సిలర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ పరిశుభ్రత కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి చెత్త తొలగింపు కార్యక్రమంలో పాల్గొని శ్రమదానం చేశారు. ఆయన మాట్లాడుతూ, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి ఇంటి నుండి తడి చెత్త, పొడి చెత్తలను వేరు చేసి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు క్రమం తప్పకుండా అందించాల్సిందని సూచించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాల్సిందని చెప్పారు.ప్రజా ప్రతినిధులు మరియు అధికారులు వార్డుల్లో పర్యటించి కాలనీలలో చెత్త తొలగింపు, డ్రైనేజీల శుభ్రపరచడం, రోడ్లను పరిశుభ్రంగా ఉంచడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు మరియు ప్రజలు కలిసి పట్టణాన్ని పరిశుభ్రంగా, అందంగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్ అర్హత పోటీల్లో ఇటలీ విజయం

### ఆస్ట్రియాపై 3–0 గోల్స్ తేడాతో ఘన విజయం






సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 10: తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో జరుగుతున్న ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్ 2026 అర్హత పోటీల్లో భాగంగా మార్చి 9న పూల్–ఎ లో జరిగిన ఐదవ మ్యాచ్‌లో ఇటలీ జట్టు ఆస్ట్రియా జట్టుపై 3–0 గోల్స్ తేడాతో విజయం సాధించింది. మధ్యాహ్నం 12.45 గంటలకు ప్రారంభమైన ఈ మ్యాచ్‌ను సమాచార మరియు ప్రజా సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సి హెచ్ ప్రియాంక ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హాకీ కర్ణాటక అధ్యక్షుడు ఎస్ వి ఎస్ గుప్తా, హాకీ మహారాష్ట్ర ఉపాధ్యక్షుడు మరియు హాకీ ఇండియా కార్యవర్గ సభ్యుడు మనోజ్ భోరే, హాకీ ఇండియా కార్యవర్గ సభ్యురాలు గుర్‌ప్రీత్ కౌర్ పాల్గొన్నారు. హాకీ ఇండియా డైరెక్టర్ జనరల్ ఆర్ కె శ్రీవాస్తవ కూడా కార్యక్రమంలో పాల్గొని మ్యాచ్‌ను వీక్షించారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోటీలో ఇటలీ జట్టు సమర్థవంతమైన ఆటతీరుతో మూడు గోల్స్ సాధించి ఆస్ట్రియా జట్టును ఓడించింది.

# పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధతో త్వరిత పరిష్కారం చేయాలని అధికారులకు ఆదేశం

## ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ఆదేశాలు పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధతో త్వరిత పరిష్కారం చేయాలని అధికారులకు ఆదేశం





సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 10: ప్రజావాణి పిర్యాదులపై అధికారులు సత్వరమే చర్యలు తీసుకుని పరిష్కారం చూపించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రత్యక్షంగా పాల్గొని ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు.కలెక్టర్ ఆదేశాల ప్రకారం, ప్రజావాణి కార్యక్రమానికి అన్ని సంబంధిత శాఖలు తప్పనిసరిగా హాజరు కావాలి. వివిధ శాఖల్లో చాలా కాలం పెండింగ్‌లో ఉన్న పిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలి. రాష్ట్ర స్థాయి ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను కూడా త్వరగా పరిష్కరించాలని, కలెక్టరేట్ లోని ప్రతి కార్యాలయం పరిశుభ్రంగా ఉండాలని, ఫైల్స్ సక్రమంగా ఉంచాలని, ప్రతి కార్యాలయ సిబ్బంది హాజరును ఫేస్ రికగ్నిషన్ యాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకు సంబంధించిన 24, జిల్లా పంచాయతీ అధికారి 5, డి ఆర్ డి ఏ 8, వైద్య ఆరోగ్య శాఖ అధికారి 3 మరియు మిగిలిన 41 దరఖాస్తులు వివిధ శాఖలకు చెందినవని, మొత్తం 83 దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపి పరిష్కరించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి, డిఇఓ అశోక్, సంక్షేమ అధికారులు నర్సింహారావు, నరసింహ, శంకర్, ఇతర జిల్లా అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

# ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ విధులకు గైర్హాజరైన ముగ్గురు వైద్యులు, ముగ్గురు నర్సులు సస్పెన్షన్‌కు ఆదేశం





సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 10: ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా సూర్యాపేట ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేస్తూ రోగులకు డాక్టర్లు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు.తనిఖీ సమయంలో హాజరు నమోదు వ్యవస్థను పరిశీలించగా మొత్తం 50 మంది బోధనా సిబ్బంది మరియు ఇతర సిబ్బంది విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. దీనిపై సంబంధిత విభాగాల అధిపతుల నుండి వివరణ కోరగా 44 మంది సిబ్బందికి సహేతుక కారణాలు ఉన్నట్లు తెలిపారు. మిగిలిన ఆరుగురిలో ముగ్గురు వైద్యులు, ముగ్గురు నర్సులు గైర్హాజరైనందుకు వారిని సస్పెండ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ, రోగులకు అందిస్తున్న పౌష్టికాహారం పై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. డాక్టర్లు, నర్సులు మరియు ఇతర సిబ్బంది హాజరు నమోదు విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సాధారణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని, ఆసుపత్రి సేవలను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు.మందుల కొరత లేకుండా చూసుకోవాలని, అత్యవసర విభాగంలో సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. నూతనంగా నిర్మించిన మాతా శిశు సంరక్షణ కేంద్రం పనులు దాదాపు పూర్తయ్యాయని, త్వరలో ప్రారంభానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే మరింత మంది రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించగలమన్నారు. మాతా శిశు కేంద్రంలో నెలకు సగటున 240 నుండి 300 ప్రసవాలు జరుగుతున్నందుకు సిబ్బందిని అభినందించారు. నవజాత శిశు సంరక్షణ విభాగం సేవలు బాగున్నాయని ప్రశంసించారు. మోకాళ్ళ మార్పిడి, తుంటి మార్పిడి వంటి క్లిష్ట శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు వైద్యులను కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. శ్రవణ్ కుమార్, శిశు వైద్య విభాగం అధిపతి డాక్టర్ ఎస్. శ్రీకాంత్ భట్, ఆసుపత్రి పరిపాలన వైద్యురాలు డాక్టర్ జె. మనీషా, ఉప ప్రధాన వైద్యాధికారులు డాక్టర్ అరుంధతి, బి. జనార్ధన్, వైద్యాధికారులు డాక్టర్ లక్ష్మణ్, వినయ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు అవసరం డ్రగ్స్ నిర్మూలనకు సమిష్టిగా కృషి చేయాలి: జిల్లా కలెక్టర్

సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 10: జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రమాదాలకు కారణమవుతున్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన భద్రతా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించి రహదారి భద్రతపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా రహదారులపై తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి వాటిని ప్రమాద ప్రాంతాలుగా గుర్తించాలన్నారు. అక్కడ హెచ్చరిక బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే పాఠశాల బస్సులు రహదారి భద్రత ప్రమాణాలు పాటిస్తున్నాయా లేదా అని రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని, అధిక లోడుతో ప్రయాణించే వాహనాలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగినప్పుడు గాయపడిన వారికి తక్షణ చికిత్స అందించేందుకు ఆసుపత్రులు సిద్ధంగా ఉండాలని, అవసరమైన అంబులెన్స్ సదుపాయం కల్పించాలని పేర్కొన్నారు.అనంతరం డ్రగ్స్ నిర్మూలనపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాల విక్రయాన్ని పూర్తిగా అరికట్టాలని అధికారులను ఆదేశించారు. వైద్యుల సూచన లేకుండా మత్తు మందులను విక్రయించే మెడికల్ షాపులపై కేసులు నమోదు చేయాలని డ్రగ్ ఇన్స్పెక్టర్‌కు సూచించారు. అలాగే గుడుంబా, నాటు సారా విక్రయాలను అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.పాఠశాలల పరిసర ప్రాంతాల్లో పాన్ దుకాణాలపై నిఘా పెట్టి విద్యార్థులకు మత్తు పదార్థాలు అందకుండా చూడాలని, ప్రతి గురువారం పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాలను భాగస్వామ్యం చేస్తూ గ్రామాల్లో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి జిల్లాను మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కే. సీతారామారావు, అదనపు పోలీస్ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి వెంకటరమణ, విద్యాశాఖ అధికారి అశోక్, మహిళా శిశు సంక్షేమ అధికారి నరసింహారావు, రవాణా, ఎక్సైజ్, రహదారి నిర్మాణ శాఖ అధికారులు, జాతీయ రహదారి అధికారులు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.





# సూర్యాపేటలో రహదారులు-భవనాల అతిథి గృహానికి శంకుస్థాపన పది కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణం

సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 10: సూర్యాపేట పట్టణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రహదారులు మరియు భవనాల శాఖ ఆధ్వర్యంలో పది కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న రహదారులు-భవనాల అతిథి గృహానికి రాష్ట్ర ఆహార పౌరసరఫరాలు మరియు నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత, సూర్యాపేట ఆర్డీవో వేణు మాధవరావు, తహసీల్దార్ కృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.




# అక్రమ ఇసుక రవాణా పట్టివేత ట్రాక్టర్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు

సందేశం టైమ్స్, నేలకొండపల్లి, మార్చి 10: చనుపల్లి గ్రామ శివారులోని పాలేరు వాగు నుండి ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అధికారులు పట్టుకున్నారు. వివరాల ప్రకారం మార్చి 9 సాయంత్రం సమయంలో నేలకొండపల్లి మండలం జక్కేపల్లి గ్రామానికి చెందిన పుట్టపాక కోటయ్య తండ్రి వెంకన్నకు చెందిన ట్రాక్టర్ ద్వారా పాలేరు వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# ఇండస్ట్రీలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంపు అవసరం

## మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐలో ఆధునిక స్వల్పకాలిక కోర్సుల ప్రారంభం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 10: తెలంగాణ ప్రభుత్వ 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐలోని ఆధునిక సాంకేతిక కేంద్రంలో నూతన స్వల్పకాలిక కోర్సులను రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి డాక్టర్ జీ. వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు ఆధునిక నైపుణ్యాలు అందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా కంప్యూటర్ నియంత్రిత యంత్రాల నిర్వహణ, యంత్ర మానవ సాంకేతికత, విద్యుత్ వాహన సాంకేతికత, రెండు కొలతలు-మూడు కొలతల ఉత్పత్తి రూపకల్పన వంటి ఆధునిక కోర్సులను ప్రారంభిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు కలిగిన యువత కొరత ఉందని అనేక పరిశ్రమలు సూచిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.ప్రస్తుత కాలంలో ఒక్క నైపుణ్యం సరిపోదని, యువత అనేక నైపుణ్యాలను అలవరచుకుంటే ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని మంత్రి అన్నారు. ఆధునిక సాంకేతిక కేంద్రాల నుంచి బయటకు వచ్చే ప్రతి విద్యార్థికి ఉపాధి అవకాశాలు కల్పించేలా శిక్షణ విధానం ఉండాలని విద్యాసంస్థల ప్రధానులకు సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన కోర్సులను త్వరలో ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రపంచంతో పోలిస్తే వ్యవసాయ రంగంలో ఉత్పాదకత తక్కువగా ఉండటంతో వ్యవసాయ అనుబంధ రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.విద్యార్థులు జీవితంలో విజయాన్ని సాధించాలంటే క్రమశిక్షణ ఎంతో అవసరమని, కొత్త విషయాలు నేర్చుకోవాలనే ఆసక్తి ఉండాలని మంత్రి సూచించారు. విదేశాల్లో కూడా ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, ఉపాధి మరియు శిక్షణ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, అధికారులు, శిక్షకులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో సుతారి మేస్త్రి మృతి

## తీవ్ర రోడ్డు ప్రమాదంలో మృతుడితో పాటు ఇద్దరు గాయపడ్డారు, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు





సందేశం టైమ్స్, ఖమ్మం, మార్చి 10: ఖమ్మం మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన షేక్ మౌలానా (45), కులం దూదేకుల, వృత్తి సుతారి మేస్త్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మార్చి 08 రాత్రి 11:30 గంటల సమయంలో షేక్ మౌలానా తన స్నేహితులు అల్లి నరేష్ మరియు కొత్తపల్లి అశోక్‌లతో కలిసి TS-04FK-2731 నెంబర్ గల క్రెటా కారులో జగ్గయ్యపేటలో జరిగిన ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామ శివారులో ఉన్న జాతీయ రహదారి 365(A) పై ప్రయాణిస్తుండగా కారు నడుపుతున్న కొత్తపల్లి అశోక్ అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడపడం వల్ల కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కల్వర్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలు కాగా వారిని చికిత్స కోసం నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ షేక్ మౌలానా తీవ్ర గాయాల కారణంగా మృతి చెందాడు. కారు నడిపిన అశోక్ మరియు నరేష్ గాయాలతో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. మృతుడి అక్క షేక్ హుస్సేన్ బి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.



# పోలీస్ వ్యవస్థను సాంకేతికంగా మరింత బలోపేతం చేయాలి

## ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో పోలీసుల పాత్ర కీలకం: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 10: తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్–2026 కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని పోలీస్ అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి పోలీసులు చేస్తున్న కృషిని అభినందించారు. మనం ఎక్కడ ఉన్నామో తెలుసుకుంటేనే ఎక్కడికి చేరుకోవాలో స్పష్టత వస్తుందని, అందుకే రిట్రీట్ కార్యక్రమం ద్వారా సమస్యలు మరియు వాటి పరిష్కారాలపై సమగ్రంగా విశ్లేషించుకున్నామని తెలిపారు.సవాళ్లు రెండు రకాలుగా ఉంటాయని, ఒకటి సాంకేతిక సవాళ్లు, రెండవది అనుకూలన సవాళ్లు అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అవసరమైన వనరులు మరియు సమయం కేటాయిస్తే సాంకేతిక సవాళ్లను అధిగమించవచ్చని, అయితే అనుకూలన సవాళ్లలో సమస్యల లోతును పూర్తిగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఏ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా శాంతి భద్రతలు కట్టుదిట్టంగా ఉండాలని ఆయన అన్నారు. రాష్ట్రంలో పాలసీ స్థంభన ఉండకూడదనే ఉద్దేశంతో తెలంగాణ రైజింగ్ 2047 విధాన పత్రాన్ని రూపొందించామని తెలిపారు.పెట్టుబడులను ఆకర్షించేందుకు ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న సుమారు 2100 కిలోమీటర్ల ప్రాంతాన్ని కోర్ అర్బన్ ప్రాంతంగా పరిగణిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వెల్లడించారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పేర్కొన్నారు.దేశంలోని ఇతర మెట్రోపాలిటన్ నగరాల్లో ఎదురవుతున్న సమస్యల నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఢిల్లీ కాలుష్య సమస్యతో, బెంగుళూరు ట్రాఫిక్ సమస్యలతో, ముంబై మరియు చెన్నై నగరాలు వరదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెప్పారు.ఏ సమస్య వచ్చినా ప్రజలు మొదట సహాయం కోసం పోలీసులనే ఆశ్రయిస్తారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఒకప్పుడు తీవ్రవాదం ప్రధాన సమస్యగా ఉండేదని, దాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. ఇప్పటి వరకు భౌతిక నేరాలను నిరోధించేందుకు పలు వ్యవస్థలు ఏర్పాటు చేశామని, కానీ ప్రస్తుతం నేరాల స్వరూపం మారిపోయి సైబర్ నేరాలు పెరుగుతున్నాయని అన్నారు.ఈ నేపథ్యంలో పోలీస్ వ్యవస్థను సాంకేతికంగా మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, సాంకేతిక నైపుణ్యం ఉన్న అధికారులను నియమించుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న సిబ్బందిని కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ ఇచ్చి అభివృద్ధి చేయాలని చెప్పారు.రిట్రీట్ కార్యక్రమం ద్వారా అధికారులు తమ సమస్యలను గుర్తించి పరిష్కారాలపై పలు ప్రతిపాదనలు అందించారని తెలిపారు. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు, నియామకాలు తదితర అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలను విశ్లేషించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కమిటీ పరిశీలన అనంతరం చట్టరూపంలో ప్రతిపాదనలు తీసుకురావాలని సూచించారు.పోలీస్ శాఖలో సిబ్బంది పునర్వ్యవస్థీకరణ చేసి జనాభా ప్రాతిపదికన పోలీసింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు.శాఖలోని వివిధ విభాగాల మధ్య సమన్వయం ఉండాలని, ఉద్యోగులు నిర్లక్ష్య ధోరణిలో పనిచేయడం సమాజానికి ప్రమాదకరమని హెచ్చరించారు. పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు ఆధునికీకరణ చెందాల్సిందేనని, అవసరమైన నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.పనితీరు ఆధారంగానే పోస్టింగులు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రతి సంవత్సరం డిసెంబరులో పోలీస్ అధికారుల రిట్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని, బడ్జెట్ ప్రవేశపెట్టే ముందు ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తే అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించుకోవచ్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.




# మహిళా శక్తికి ప్రెస్ క్లబ్ ఘన వందనం సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర వెలకట్టలేనిది; జర్నలిజం రంగంలో మహిళలు ధైర్యంగా ముందుకు రావాలి

సందేశం టైమ్స్, ఖమ్మం, మార్చి 10: ఖమ్మం నగరంలోని ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజేఎఫ్-హెచ్ 2843) మరియు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంతోటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సమాజంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళా మూర్తులను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీసిఎస్ అధికారిణి వేల్పుల విజేత మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని, కుటుంబ బాధ్యతలతో పాటు వృత్తి జీవితంలో కూడా మహిళలు ముందంజలో నిలవడం సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆమె తన వ్యక్తిగత అనుభవాలను పంచుకుంటూ, భర్త అందించిన సహకారం వల్లే ఆమె విజయానికి అవకాశం లభించిందని భావోద్వేగంగా తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఓబీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ హారిక నాయుడు మాట్లాడుతూ, మహిళా సాధికారత మాటల్లోనే కాకుండా కార్యరూపంలో కనిపించాలన్నారు. జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి నానబాల రామకృష్ణ, కోశాధికారి అర్వపల్లి నగేష్‌లు జర్నలిజం రంగంలో మహిళా విలేకరులు ధైర్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు గౌరవరపు జగదీష్, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారిణి రమాదేవి, న్యాయవాది శృతి, ఏఎస్ఐ పి లక్ష్మి, విలేకరి నవజీవన ప్రియ, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు ఎలుగోటి వెంకట్రావు, ప్రెస్ క్లబ్ కోశాధికారి భద్రయ్య, జిల్లా మహేష్, యాంకర్ నాయిని స్వాతి, యాంకర్ హర్షిక, యాంకర్ రేష్మ, అంతోటి నాగమణి, గౌరవరపు సునీత తదితరులు, పెద్ద సంఖ్యలో విలేకరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యే లక్ష్యం పారిశుధ్యం, విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 10 (జిల్లా ప్రతినిధి టీ. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు పారిశుధ్యం, విద్యార్థులకు అందే సౌకర్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు.ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇస్నాపూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, పారిశుధ్యం, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేస్తోందన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు చదువుపై మరింత దృష్టి సారించాలని సూచించారు.హాల్ టికెట్లు అందాయా, అందులో వివరాలు సరిగా ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు పునశ్చరణ చేస్తున్నారా అని ప్రశ్నిస్తూ ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా ధైర్యంగా పరీక్షలు రాయాలని ప్రోత్సహించారు.పాఠశాలలో మధ్యాహ్న భోజన షెడ్యూల్ సరిగా అమలు కావడం లేదని గుర్తించిన కలెక్టర్, సంబంధిత సంస్థకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు గుడ్లు అందించడం లేదని గమనించి వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనుమతి లేకుండా గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్, ప్రధానోపాధ్యాయుడికి కారణం తెలియజేయమని నోటీసు ఇవ్వాలని ఆదేశించారు.కొంతమంది ఉపాధ్యాయులు గైర్హాజరు కావడంపై మండల విద్యా అధికారిని వివరణ కోరాలని, పర్యవేక్షణలో లోపం ఉన్నందుకు మండల విద్యా అధికారికి కూడా నోటీసు జారీ చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారికి సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని స్పష్టం చేశారు.శానిటేషన్ గ్రాంట్ కింద ఎంతమంది కార్మికులను నియమించుకున్నారో, వారి పేర్లు మరియు చెల్లింపుల వివరాలను సమర్పించాలని సూచించారు.పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడం, భోజనశాల శుభ్రత లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చెత్త నిల్వ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, అక్కడ మంటలు చెలరేగిన ప్రాంతాన్ని 24 గంటల్లో నీటి ట్యాంకర్ల సహాయంతో పూర్తిగా ఆర్పివేయాలని ఆదేశించారు. వేరు చేసిన ప్రాంతంలో ఉన్న పాత చెత్తను 48 గంటల్లో తరలించి ప్రదేశాన్ని శుభ్రం చేయాలని సూచించారు.చెత్త నిల్వ కేంద్రం వద్ద పర్యవేక్షణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అక్రమంగా చెత్త వేయకుండా 24 గంటల పర్యవేక్షణ ఉండేలా కార్మికుడిని నియమించాలని ఆదేశించారు. చెత్త సేకరణ, ప్రాసెసింగ్, తరలింపు అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వెంటనే చర్యలు తీసుకుని అమలు నివేదిక సమర్పించాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుమలత, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్‌లో సీఎం సూచనలు

సందేశం టైమ్స్, హైదరాబాదు, మార్చి 10: తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్-2026 కార్యక్రమంలో భాగంగా, వివిధ విభాగాల పోలీస్ ఉన్నతాధికారులు సీఎంకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భవిష్యత్తులో పోలీసింగ్‌లో తీసుకురావాల్సిన మార్పులు, ప్రభుత్వ చర్యల అవసరాన్ని వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు పోలీస్ ఉన్నతాధికారులకు పలు సూచనలు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నందున కొత్త తరహా నేరాలు పెరగకుండా సైబర్ క్రైమ్ విభాగాన్ని మరింత పటిష్టం చేయాలని, నేరాలను నిరోధించడానికి మరియు నేరస్థులను త్వరగా గుర్తించడానికి AI టెక్నాలజీ వినియోగాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. అలాగే, విద్యా సంస్థల్లో విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గమనించి, డ్రగ్స్ బాధితులను గుర్తించి వారికి కౌన్సిలింగ్ అందించే విధంగా కౌన్సిలర్స్ నియమించుకోవాలని కూడా ముఖ్యమంత్రి పరిశీలించాలని పేర్కొన్నారు.

# ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 41 ఫిర్యాదుల స్వీకరణ: అదనపు కలెక్టర్ పాండు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 10 (జిల్లా ప్రతినిధి టీ. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లాలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా స్వయంగా హాజరై సమయపాలన పాటించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ (ఇన్‌చార్జ్) పాండు ఆదేశించారు.సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొంతమంది అధికారులు హాజరు కాకుండా వారి సహాయకులను పంపుతున్న విషయాన్ని గమనించామని, ఇకపై అలాంటి పరిస్థితి ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సక్రమంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా మొత్తం 41 ఫిర్యాదులు స్వీకరించినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి దూర ప్రాంతాల నుంచి ప్రజావాణికి వస్తారని పేర్కొంటూ వారి సమస్యలను అధికారులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతో పాటు తగిన పరిష్కార మార్గాలను సూచించాలని అన్నారు. ప్రజా సమస్యలపై ఆయా శాఖల అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి జానకిరెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# గిరిజన రైతుల కోసం కనీస మద్దతు ధర అమలు అవగాహన ఒప్పందం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 10: ఈ రోజు, మార్చి 9, 2026 మధ్యాహ్నం 3:00 గంటలకు, తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన రైతులు సేకరించిన అటవీ ఉత్పత్తుల కోసం కనీస మద్దతు ధర అందించడానికి భారత ప్రభుత్వం, న్యూఢిల్లీలోని గిరిజన అభివృద్ధి సమితి మరియు తెలంగాణ గిరిజన సహకార సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది.గిరిజన సహకార సంస్థ వైస్-చైర్మన్ మరియు నిర్వహణ ప్రధానుడు శ్రీ సబ్యసాచి ఘోష్, మరియు గిరిజన అభివృద్ధి సమితి నిర్వహణ ప్రధానుడు శ్రీ ఎం. రాజమురుగన్ సంతకం చేశారు.నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి కేంద్ర స్థాయిలో గిరిజన అభివృద్ధి సమితి నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుంది, రాష్ట్ర స్థాయిలో తెలంగాణ గిరిజన సహకార సంస్థ ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తుంది. ఈ ఒప్పంద సంతకం ద్వారా, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కార్యక్రమం నెరవేరగా, చిన్న అటవీ ఉత్పత్తులపై ఆధారపడిన గిరిజన రైతులు కనీస మద్దతు ధర ద్వారా గణనీయంగా లాభపడతారు.అంతేకాక, రాష్ట్రంలోని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థల అధికార పరిధిలో అవసరమైన గోడౌన్లు మరియు హాత్ బజార్‌ల నిర్మాణానికి మద్దతు కూడా అందిస్తుంది.



## గ్రామ భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు తన సొంత నిధులతో ఏర్పాటుకు హామీ ఇచ్చిన సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి

సందేశం టైమ్స్, వట్పల్లి, మార్చి 10 (జిల్లా ప్రతినిధి టీ. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల పరిధిలోని షాద్‌నగర్ (గట్టుపల్లి) గ్రామ అభివృద్ధి, భద్రతను దృష్టిలో ఉంచుకుని తన సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉంటుందని వట్పల్లి ఎస్సై లవకుమార్ పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధి కోసం ముందడుగు వేసిన శ్రీనివాస్ రెడ్డిని ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో షాద్‌నగర్, గట్టుపల్లి ప్రాంతాల నాయకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## కేజీబీవీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపిన సిబ్బంది – టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్



సందేశం టైమ్స్, పుల్కల్, మార్చి 10 (అందోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కే. మల్లేశం గౌడ్): తెలంగాణ రాష్ట్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు చౌటాకూర్, పుల్కల్ కేజీబీవీ పాఠశాలల సిబ్బంది సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ కేజీబీవీల్లో పనిచేస్తున్న సిబ్బందికి బేసిక్ పే అమలు చేసి వారిని రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే కేజీబీవీ సిబ్బందికి హెల్త్ కార్డులు అందించడంతో పాటు కేర్‌టేకర్లను నియమించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ పుల్కల్ మండల ప్రధాన కార్యదర్శి తేరటి నరసింహ, కార్యదర్శి బి. శ్రీనివాస్, కేజీబీవీల్లో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులు మరియు ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.




## ఆపద సమయాల్లో సమాజానికి సేవ చేయాలి ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లకు ఏడు రోజుల ఆపద మిత్ర శిక్షణ పూర్తి: ప్రిన్సిపల్ డా. ప్రవీణ

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 10 (నియోజకవర్గ ఇన్‌చార్జి కె. సంగమేశ్వర్): ఆపద పరిస్థితుల్లో ప్రజలను రక్షించేందుకు యువత ముందుండి సేవ చేయాలని తారా ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి) సంగారెడ్డి ప్రిన్సిపల్ డా. ప్రవీణ తెలిపారు. కళాశాలకు చెందిన 37 మంది ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు "ఆపద మిత్ర" (విపత్తు నిర్వహణ) కార్యక్రమంలో భాగంగా ఏడు రోజుల శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారని పేర్కొన్నారు.మేరా యువ భారత్ సంగారెడ్డి సహకారంతో ఫిబ్రవరి 27 నుండి మార్చి 5 వరకు హైదరాబాద్‌లో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. హైడ్రా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొని విపత్తుల సమయంలో చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర శిక్షణ పొందారు.ఈ శిక్షణలో భాగంగా భారత వాతావరణ శాఖ అధికారులు వరదలు, భారీ వర్షాలు, వేసవిలో తీవ్ర ఎండల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అలాగే గ్యాస్ సిలిండర్ పేలుళ్లు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను ఎలా రక్షించాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. జాతీయ విపత్తు స్పందన దళానికి చెందిన సుధీర్ వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజలను ఎలా రక్షించాలి అనే అంశాలను వివరించారు.అదేవిధంగా కుక్కకాటు, పాము కాటు వంటి అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు, ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాథమిక చికిత్స అందించే విధానం, గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్ ఎలా చేయాలి అనే అంశాలను విద్యార్థులకు ప్రాయోగికంగా చూపించారు. హైదరాబాద్‌లోని బతుకమ్మ కుంట వద్ద వరద పరిస్థితులను అనుకరించి బోట్ల సహాయంతో ప్రజలను ఎలా రక్షించాలి అనే అంశంపై ప్రత్యక్షంగా శిక్షణ ఇచ్చారు.ఈ ఏడు రోజుల శిక్షణలో కళాశాల విద్యార్థులు విపత్తు నిర్వహణకు సంబంధించిన అనేక ముఖ్యమైన అంశాలను నేర్చుకోవడం ఆనందంగా ఉందని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన మేరా యువ భారత్, సంగారెడ్డి జిల్లా యువజన అధికారి రంజిత్ రెడ్డి, ప్రోగ్రామ్ అధికారి కిరణ్ కుమార్‌లకు కళాశాల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డా. జగదీశ్వర్, డా. సదయ, కుమార్, డా. వల్లి సౌభాగ్యం, ఇతర అధ్యాపక బృందం మరియు శిక్షణ పొందిన ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో 13న జాబ్ మేళా – 800కు పైగా ఉద్యోగాలు

సంగారెడ్డి, మార్చి 10( సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి సంగమేశ్వర్ ) తెలంగాణ రాష్ట్ర డిజిటల్ ఎంప్లాయ్మెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో జహీరాబాద్‌లోని మహీంద్రా & మహీంద్రా ట్రాక్టర్ తయారీ యూనిట్‌లో ఉద్యోగాల భర్తీ కోసం మార్చి 13న సంగారెడ్డిలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జా నాయక్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 9 గంటలకు సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, హనుమాన్ నగర్, ఇస్మాయిల్ ఖాన్‌పేట్‌లో ఈ జాబ్ మేళా జరగనుంది. ట్రెయినీ, అప్రెంటిస్ పోస్టుల ద్వారా 800కు పైగా ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యా ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, బయోడేటా మరియు ఇతర అవసరమైన పత్రాలతో జాబ్ మేళాకు హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## మహిళలు ఏ రంగంలోనైనా రాణించగలరు

### సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకం: మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా





సందేశం టైమ్స్, జహీరాబాద్, మార్చి 10 (జిల్లా ప్రతినిధి టీ. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని తుంకుంట గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జహీరాబాద్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి అస్మా మాట్లాడుతూ మహిళలు ఏ పాత్రనైనా సామర్థ్యవంతంగా నిర్వహించగలరని పేర్కొన్నారు. స్త్రీ–పురుషులు సమాజానికి రెండు రెక్కల వంటివారని, రెండూ సమానంగా బలంగా ఉన్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. సమాన భావన ఇంటి నుంచే ప్రారంభమవ్వాలని, సమాజ నిర్మాణంలో మహిళలు నిజమైన నిర్మాణ కర్తలని తెలిపారు.అనంతరం మహిళలకు ఇంటికి ఒక తులసి మొక్కతో పాటు వివిధ రకాల పూల మొక్కలను అందజేసి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు సుజాత, చంద్రకళ, స్వప్న, ఈశ్వరమ్మ, మమత, అంజలి, చంద్రమ్మ, లక్ష్మమ్మ, పవిత్ర, ఉమా తదితరులు పాల్గొన్నారు.

## ప్రాధాన్యతా రంగాల రుణాల లక్ష్య సాధనకు బ్యాంకులు కృషి చేయాలి జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.డి. మాధురి సూచనలు








సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 10 (నియోజకవర్గ ఇన్‌చార్జి కె. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లాలో ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరును పెంచేందుకు బ్యాంకులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ ఆర్.డి. మాధురి సూచించారు.డిసెంబర్ 2025 త్రైమాసికానికి సంబంధించిన జిల్లా సంప్రదింపుల కమిటీ మరియు జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశాన్ని సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ ఆర్.డి. మాధురి అధ్యక్షత వహించగా, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ నర్సింగ్ రావు సమావేశాన్ని సమన్వయం చేశారు.సమావేశంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ సహాయ ప్రధాన అధికారి శ్రీనివాస్ వెన్న, నాబార్డ్ సహాయ ప్రధాన అధికారి కృష్ణతేజ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిద్ధిపేట ప్రాంతీయ అధికారి శ్రీనివాస్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి జానకిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, అన్ని బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిసెంబర్ 2025 త్రైమాసికానికి సంబంధించిన బ్యాంకింగ్ కార్యకలాపాలపై జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వివరాలు సమర్పించారు. జిల్లాలో పంట రుణాల లక్ష్యం 2244.72 కోట్ల రూపాయలకు గాను 65.93 శాతం, మొత్తం వ్యవసాయ రుణాల లక్ష్యం 4232.98 కోట్ల రూపాయలకు గాను 62.97 శాతం, మొత్తం అడ్వాన్సులు 16082.57 కోట్ల రూపాయలకు గాను 68.89 శాతం సాధించినట్లు తెలిపారు.అదేవిధంగా విద్యా రుణాలు, గృహ రుణాలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రుణాలు, స్వయం సహాయక సంఘాల రుణాలు తదితర రంగాల వారీగా లక్ష్యాలు మరియు సాధించిన ప్రగతిపై సమావేశంలో చర్చించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ ప్రాధాన్యతా రంగాల రుణాల మంజూరులో బ్యాంకులు మరింత చురుకుగా పనిచేసి లక్ష్యాలను సాధించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.భారతీయ రిజర్వ్ బ్యాంక్ సహాయ ప్రధాన అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంకులకు కేటాయించిన గ్రామాల్లో ప్రధానమంత్రి జనసురక్ష పథకాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఎక్కువ మంది లబ్ధిదారులను నమోదు చేయాలని సూచించారు. ఖాతాదారుల వివరాలను నవీకరించే ప్రక్రియను పూర్తి చేయడం, ఖాతాలను సక్రమంగా నిర్వహించుకోవడం గురించి వినియోగదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు.నాబార్డ్ సహాయ ప్రధాన అధికారి కృష్ణతేజ మాట్లాడుతూ వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి, కిసాన్ క్రెడిట్ కార్డ్, పశుసంవర్ధక మరియు మత్స్యరంగ రుణాల కింద అర్హులైన లబ్ధిదారులకు మరింతగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి జానకిరెడ్డి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జా నాయక్, ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లు, డిఆర్‌డిఏ, డిఐసి తదితర విభాగాల అధికారులు మరియు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ విద్యార్థులకు చెక్కుల అందజేత ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా పంపిణీ



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 10 (నియోజకవర్గ ఇన్‌చార్జి కె. సంగమేశ్వర్): ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులకు వారి వైద్య విద్యకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. ఈ చెక్కులను ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బి.ఎల్.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మొత్తం 15 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు దాదాపు 10 లక్షల రూపాయల చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ బి.ఎల్.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ప్రోత్సాహం కలిగిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రభుదాస్, బి.ఆర్.ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్, చర్లపల్లి డివిజన్ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు నేమూరి మహేష్ గౌడ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సింగూరు గురుకులంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళా ఉపాధ్యాయులకు శాలువాలతో సత్కారం



సందేశం టైమ్స్, పుల్కల్, మార్చి 10 (జిల్లా ప్రతినిధి టీ. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను ప్రత్యేకంగా సన్మానించారు.పాఠశాల ప్రిన్సిపాల్ గౌతమ్ ఆగమయ్య, ఉపాధ్యాయ బృందం చేతుల మీదుగా మహిళా ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల ప్రతి ఒక్కరూ మర్యాదపూర్వకంగా మెలగాలని, వారి ప్రాముఖ్యతను గుర్తించి ఎల్లవేళలా గౌరవించాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చౌటకూర్ మండలంలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ




సందేశం టైమ్స్, చౌటకూర్, మార్చి 10 (నారాయణఖేడ్ నియోజకవర్గ ఇన్‌చార్జి టీ. చంద్రశేఖర్): సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి పథకం కింద లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి కృష్ణయ్య, ఉప మండల రెవెన్యూ అధికారి ప్రమోద్ పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ సుభాష్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నత్తి దశరథ్, చౌటకూర్ గ్రామ సర్పంచ్ పార్కుల రామ్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు రామా గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.అలాగే చౌటకూర్ మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ అధ్యక్షులు, లబ్ధిదారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు హాజరయ్యారు.

## తుంకి గ్రామంలో ఘనంగా నల్ల పోచమ్మ జాతర ఉత్సవాలు



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 10 (టౌన్ ప్రతినిధి బి. సంగమేశ్వర్): మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తుంకి గ్రామంలో నల్ల పోచమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా నిర్వహించిన పూజలు, ప్రత్యేక కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు. అలాగే జిల్లా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు రాజేందర్, సంఘసాని రాజు, కుమార్, హరీష్ గౌడ్, ఆంజనేయులు, వెంకటేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.అలాగే తుంకి గ్రామ ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



## మహిళా దినోత్సవం సందర్భంగా న్యాయ అవగాహన సదస్సులు మహిళలు, పిల్లలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి: బి. సౌజన్య

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 10 (జిల్లా ప్రతినిధి టి. సంగమేశ్వర్):సంగారెడ్డి జిల్లాలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హత్నూర గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో న్యాయ అవగాహన సదస్సులు నిర్వహించారు.జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనలతో కార్యదర్శి బి. సౌజన్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బి. సౌజన్య మాట్లాడుతూ మహిళలు, పిల్లలు చట్టాలపై అవగాహన కలిగి ఉండటం అవసరమని తెలిపారు. బాలలపై లైంగిక నేరాల నిరోధానికి పోక్సో చట్టం కింద కఠిన శిక్షలు అమలులో ఉన్నాయని, కుటుంబంలో మహిళలపై హింసను అరికట్టేందుకు గృహ హింస నిరోధక చట్టం రక్షణ కల్పిస్తుందని వివరించారు.అలాగే సామాజిక మాధ్యమాల వినియోగంలో మహిళలు సైబర్ వేధింపులు, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అన్యాయం జరిగినా భయపడకుండా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్యులు, గ్రామ సర్పంచ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / యజమాని / సంపాదకురాలు: కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.